క్లుప్తంగా...

అక్షరాల రూ.లక్షన్నర



రూ. 1.5 లక్షలు ఖరీదు చేసే పఠాన్‌కోట్ హైబ్రీడ్ పొటేలు

చార్మినార్: బక్రీద్ పండుగ నేపథ్యంలో ఖుర్బానీ ఇచ్చేందుకు నగరంలోని ప్రధాన కూడళ్లలో మేకలు, గొర్రెలు, పొటేళ్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులో విలైతీ అనే హైబ్రీడ్ పొటేలు అందరినీ ఆకర్షిస్తోంది. దీని ఖరీదు రూ.1.50 లక్షలుగా వ్యాపారులు పేర్కొన్నారు. పంజాబ్‌లోని పఠాన్‌కోట్ నుంచి తెప్పించిన ఈ పొటేలు ఇప్పటికే అమ్ముడు పోయినప్పటికీ ప్రదర్శనలో ఉంచినట్లు వారు తెలిపారు.

నందకిశోర్‌కు సన్మానం



నందకిశోర్‌ను సన్మానించిన నవరతన్ ఇందోరియ తదితరులు

జియాగూడ: చారిత్రక కార్వాన్ సబ్జిమండి, నట్రాజ్‌నగర్ ఉమ్మడి మాతేశ్వరీల దేవాలయాల బోనాల ఉత్సవాల నిర్వహణ పాలకవర్గం నూతన కమిటీ అధ్యక్షులుగా నియమితులైన ప్యాట నందకిశోర్‌ను బుధవారం ఘనంగా సత్కరించినట్లు రాష్ట్ర శ్రీ పరశురామ్ సేవా మండల్ వ్యవస్థాపక అధ్యక్షులు నవరతన్ ఇందోరియా అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..... 100 ఏళ్ల చరిత్ర కలిగిన సబ్జి మండి బోనాలు భారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారిని అంబారిపై ఊరేగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయిలో సత్తా చాటిన ఏఐకేఎఫ్ తెలంగాణ జట్టు



క్రీడాకారులతో తెలంగాణ స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శి ఎంకె.బాలాజీ

జియాగూడ: తెలంగాణ స్పోర్ట్స్, తెలంగాణ కరాటే డో అసోసియేషన్ ఆల్‌ఇండియా కరాటే డో ఫెడరేషన్‌లో శిక్షణ పొంది జాతీయస్థాయిలో రాణించినవారు సెలక్షన్ల ద్వారా ఏషియన్ గేమ్స్, ఒలింపిక్ పోటీల్లో అవకాశం లభిస్తుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, శిక్షకుడు ఎం.కె.బాలాజీ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన 31వ నేషనల్ కరాటే డో ఛాంపియన్‌షిప్ పోటీల్లో నగరం నుంచి 18 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. వారిలో మహ్మద్ షరీఫ్, అరవింద్ (సిల్వర్ మెడల్స్), దినేష్, విష్ణుపాటిల్, గోపాల్, వీణ, అరవింద్ కాంస్య పతకాలను సాధించినట్లు ఆయన వివరించారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు శుభాకాంక్షలు



ప్రొఫెసర్ లింబాద్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న వీసీ డాక్టర్ కవిత దరియాని రావు, రిజిస్ట్రార్ కొడాలి సుందర్‌కుమార్

విజయనగర్‌కాలనీ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ ఆర్. లింబాద్రిని బుధవారం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్‌ఫైనార్ట్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.కవిత దరియానిరావు, రిజిస్ట్రార్ కొడాలి సుందర్‌కుమార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి మాట్లాడుతూ జేఎన్ఏఎఫ్ఏయూ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

నేడు జగదాంబిక ఆలయంలో దుర్గా హోమం

లంగర్‌హౌస్: గోల్కొండ జగదాంబిక అమ్మవారి సన్నిధిలో గురువారం దుర్గా హోమం నిర్వహిస్తున్నట్లు గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆరెళ్ల జగదీష్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం అమ్మవారికి మూడవ పూజా బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు ప్రధాన పూజారి సర్వేశ్వర్ చారి ఆధ్వర్యంలో దుర్గా హోమం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బక్రీద్‌కు సర్వం సిద్ధం

ఇప్పటికే తగిన ఏర్పాట్లు

- సామూహిక ప్రార్థనలకు మీరాలం ఈద్గా, మక్కా మసీదు ముస్తాబు
- అదనపు బలగాలతో బందోబస్తు
- మీరాలం ఈద్గా రోడ్డులో కొనసాగనున్న ట్రాఫిక్ ఆంక్షలు



పాతబస్తీలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మేకలు, పొట్టేళ్లు

చార్మినార్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని నిర్వహించే సామూహిక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందుకుగాను పాతబస్తీ మీరాలం ఈద్గాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం తరపున ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసినట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన సాలార్‌జంగ్ మ్యూజియంలో సంబంధిత ఉన్నతాధికారులు, మత పెద్దలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. సామూహిక ప్రార్థనల కోసం మీరాలం ఈద్గాతో పాటు మాదన్నపేట్ ఈద్గాలో వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో షామియానాలు, జానిమాస్‌లు ఏర్పాటు చేశారు. ముస్లింలకు ఎక్కడ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

అదనపు బలగాలతో బందోబస్తు

దక్షిణ మండలంలోని 800 మంది సిబ్బందితో పాటు 11 ప్లాటూన్ల టీఎస్ఎస్‌పీ, ఏఆర్ పోలీసులు, 103 మంది సీఐలు, 14 మంది ఎస్ఐలు,7 గురు సీఐలు,6గురు డీఎస్పీలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు. మీరాలం ఈద్గాలో జరిగే సామూహిక ప్రార్థనల నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సామూహిక ప్రార్థనల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది సూచనల మేరకు వాహనదారులు ముందుకు వెళ్లాలని పోలీసు అధికారులు సూచించారు.

మక్కా మసీదుతో పాటు మీరాలం ఈద్గాలో...

బక్రీద్ సందర్భంగా గురువారం ఉదయం 9.30 గంటలకు మక్కా మసీదులో మౌలానా హాఫీజ్ లతీఫ్ అహ్మద్, మీరాలం ఈద్గాలో కతీజ్ మహ్మద్ రిజ్వాన్ ఖురేషీ నమాజ్ చేయించనున్నారు. మక్కా మసీదుతో పాటు మీరాలం ఈద్గా, మాదన్నపేట్ ఈద్గాల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దక్షిణ మండలం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం మీరాలం ఈద్గాలో జరగబోయే సామూహిక ప్రార్థనలను పురస్కరించుకుని దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, నగర ట్రాఫిక్ డీసీపీ అశోక్‌కుమార్, అదనపు డీసీపీ ప్రసాద్‌లతో పాటు దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు సంబంధిత ఇన్‌స్పెక్టర్లతో కలిసి బుధవారం మీరాలం ఈద్గాను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

పాతబస్తీలో సందడే సందడి....

బక్రీద్ పండుగ కోసం అవసరమైన గొర్రెలు, మేకలను ఖరీదు చేస్తుండడంతో పాతబస్తీ సందడి నెలకొంది. త్యాగానికి మరో పేరుగా నిర్వహించుకునే పండుగ కోసం గ్రేటర్ శివారు జిల్లాల నుంచి గొర్రెలు, మేకలు పాతబస్తీకి తరలించారు. దీంతో పాతబస్తీలోని ప్రధాన కూడళ్లయిన డబీర్‌పురా, చంచల్‌గూడ, పురానీహవేలీ, మీరాలం మండీ, మొఘల్‌పురా, రెయిన్‌బజార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, చార్మినార్, పేట్ల బురుజు, పురానాపూల్, బార్కాస్, యాకుత్‌పురా తదితర ప్రాంతాలు వినియోగదారులతో కిక్కిరిసిపోతున్నాయి. ఎక్కడ చూసినా రోడ్డుకు ఇరువైపులా తాత్కాలిక గూడారాలు కనిపిస్తున్నాయి.

బక్రీద్ ప్రార్థనలకు ఈద్గాల ముస్తాబు



ప్రార్థనలకు ముస్తాబైన పాంచ్‌ఖానా ఈద్గా

గోల్కొండ: బక్రీద్ నేపథ్యంలో సామూహిక ప్రార్థనకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల్లోని ఈద్గాలను బల్దియా అధికారులు ముస్తాబు చేశారు. నగరంలోనే అత్యంత పురాతనమైన గోల్కొండ కుతుబ్ షాహీ ఈద్గాలో ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చరల్ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. అహ్మద్‌నగర్, మాసబ్‌ట్యాంక్, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లోని ఈద్గాలు సైతం ప్రార్థనలకు ముస్తాబయ్యాయి.

ఉచిత నీటి సరఫరా

బక్రీద్ పండుగ ప్రార్థనలు జరిగే ఈద్గాల,జామా మసీదుల వద్ద ఉచితంగా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు జలమండలి డీజీఎం ఖాజా జౌహర్ అలీ తెలిపారు. మరోవైపు బల్దియా ఆధ్వర్యంలో ఈద్గాలు, మసీదుల వద్ద పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

సెల్‌ఫోన్లకు అనుమతి లేదు...



సామూహిక ప్రార్థనల నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశాం. సామూహిక ప్రార్థనలకు సెల్‌ఫోన్లు, వాటర్ బాటిల్స్ తీసుకు రావద్దు. తనిఖీలకు ముస్లింలు సహకరించాలి. వాహనాలను సూచించిన స్థలంలోనే పార్కింగ్ చేయాలి. ఈద్గాలోకి వాహనాలను తీసుకెళ్లరాదు. మీరాలం ఈద్గాలో జరిగే సామూహిక ప్రార్థనల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయి. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం.

– సాయి చైతన్య, డీసీపీ దక్షిణ మండలం.

నేటి నుంచి జాతీయ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు



మాట్లాడుతున్న విష్ణు సహాయ్

సుల్తాన్‌బజార్: హైదరాబాద్ వేదికగా గురువారం నుంచి జులై 2 వరకు జాతీయ మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు వోవీనం అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు విష్ణు సహాయ్ తెలిపారు. ఈ టోర్నీకి 24 రాష్ట్రాల నుంచి 600 మంది క్రీడాకారులు, 70 మంది అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ టోర్నీలో సత్తాచాటిన క్రీడాకారులను నవంబర్, డిసెంబర్‌లో జరిగే 7వ ప్రపంచ వోవీనం చాంపియన్‌షిప్ కోసం ఎంపిక చేస్తామన్నారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కవితను ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శంకర్ మహాబలే, ఉజ్వల్ వాఘ్మరే పాల్గొన్నారు.

'కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుంది'

గోల్కొండ: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అప్పుడే ఓటమి భయం పట్టుకుందని కార్వాన్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు కురకుల కృష్ణ అన్నారు. బుధవారం కార్వాన్ బాంజవాడిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ బలం పుంజుకోవడంతో కేసీఆర్‌లో ఆందోళన మొదలైందన్నారు. ఈ భయంతోనే ఆయన ప్రగతి భవన్ వీడి బయటికి వస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయనకు సామాన్య ప్రజలు, ఉద్యమకారులు గుర్తుకు వస్తున్నారన్నారు. పదేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకున్న ముఖ్యమంత్రి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు పరాభావం తప్పదని, భారీ మెజార్టీతో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా సిక్వాల్ ప్రాణ ప్రతిష్ఠ



వేడుకల్లో పాల్గొన్న దాసోజు శ్రవణ్, నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: సిక్వాల్ సమాజ్ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సిక్వాల్ సమాజ్ అధ్యక్షులు బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో స్వాగత వేదికలు ఏర్పాటు చేశారు. వేడుకల్లో కమల నయనదాస్ మహారాజ్, సచ్చిదానంద సరస్వతీ, త్రిదండి స్వామి, భక్తిభూషణ్, దామోదర గోస్వామీజీ మహరాజ్, రాహుల్‌దాస్‌జీ మహారాజ్, ప్రభుదాస్‌జీ మహారాజ్‌లతో పాటు బీఆర్ఎస్ నగర ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్, నందకిశోర్‌వ్యాస్ బిలాల్, పూజవ్యాస్ బిలాల్, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

అఫ్జల్‌గంజ్: ప్రతిభావంతులైన కళాకారులు, నటులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. తెలుగు,తమిళ, కన్నడ సినిమాలతో పాటు తాజాగా హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్న నటుడు చరణ్ బోనాల శ్రీనివాస్‌తో సమావేశమయ్యారు. బుధవారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంతో ఆయన చరణ్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా ఏక్తా పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మణికంఠ శర్మ, రేనుకుంట్ల ముకేష్ మేరు, మిద్దెల నరేష్ గౌడ్, శ్రీను దాసరి పాల్గొన్నారు.



నటుడు చరణ్‌ను సన్మానించిన బోనాల శ్రీనివాస్

ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల దోపిడీని అరికట్టాలి

గన్‌ఫౌండ్రీ: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల అక్రమాలను అడ్డుకోవాలని తెలంగాణ జనసమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంజే మార్కెట్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ..... ఇంజినీరింగ్ సీట్లలో 70 శాతం కన్వీనర్ కోటా సీట్లను మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్‌తోనే భర్తీ చేయాలన్నారు. అయితే పలు ఇంజినీరింగ్ కళాశాలలు స్పాట్ కౌన్సెలింగ్ పేరుతో కన్వీనర్ కోటా సీట్లను అమ్ముకుంటున్నాయని ఆరోపించారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల అక్రమ వసూళ్లపై విద్యాశాఖ స్పందించకపోవడం దారుణమన్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పెన్షనర్లకూ తెలంగాణ ప్రోత్సాహకం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

లక్డీకాపూల్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధాన పాత్ర పోషించిన పెన్షనర్లకు తెలంగాణ ప్రోత్సాహకం ఇచ్చి గౌరవించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి(టీఎస్ జీపీ జేఏసీ) చైర్మన్ కె. లక్ష్మయ్య అన్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రోత్సాహక ఇంక్రిమెంట్ ఇచ్చిన ప్రభుత్వం పెన్షనర్లను విస్మరించడం అన్యాయమన్నారు. బుధవారం తెలంగాణ పెన్షనర్ల జేఏసీ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లు వారి మూడు తరాల సభ్యులతో దాదాపు 30 లక్షల మంది ఓటర్లు ఉంటారన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలన్నారు. తమ సమస్యల పరిష్కారంలో ఉదాసీన వైఖరి అవలంభించడం తగదన్నారు. ఇప్పటికైనా కార్పొరేట్‌తో సహా అన్ని ఆసుపత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్సకు అవకాశం కల్పిస్తూ ఇహెచ్ఎస్ పథకాన్ని పటిష్టం చేయాలన్నారు. రెండు కరవు భత్యం వాయిదాలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు డి. సుధాకర్, జి. పూర్ణచందర్‌రావు, సుభాకర్‌రావు, కో చైర్మన్లు సూర్యనారాయణ, రాజేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

గార్బేజ్ బ్యాగ్‌ల పంపిణీ

గోల్కొండ: బక్రీద్ పండుగ వ్యర్థాలను తరలించేందుకు బల్దియా సిబ్బంది గురువారం మెహిదీపట్నం, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో గార్బేజ్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కుర్బానీ ఇచ్చిన జంతువుల వ్యర్థాలను రోడ్లపై పారవేయకుండా ఈ గార్బేజ్ బ్యాగుల్లో వేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని కోరుతూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.

అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ



బేలాలోని శ్రీ మాతేశ్వరి పోచమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన శేఖర్ యాదవ్ తదితరులు

యాకుత్‌పురా: హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం 75వ వార్షిక బోనాల వజ్రోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పాతబస్తీలోని ప్రముఖ దేవాలయాల్లో అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. బేలా ముత్యాలమ్మ దేవాలయం, శాలిబండ శ్రీ బంగారు మైసమ్మ దేవాలయం, హరిబౌలి శ్రీ మాతేశ్వరి పోచమ్మ, మహంకాళి ఆలయంలోని అమ్మవార్లకు ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ భరత్ ప్రకాశ్, రమేశ్ బాబు, శేఖర్ యాదవ్‌లు వేర్వేరుగా పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అక్కన్న మాదన్న ఆలయ కమిటీ సభ్యులను ఆయా దేవాలయాల కమిటీ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రాందేవ్ అగర్వాల్, ప్రతినిధులు జి.రాజారత్నం, కె.దత్తాత్రేయ, ఎ.సతీష్ కుమార్, ఎస్.పి.క్రాంతి కుమార్, జగన్‌మోహన్ కపూర్, జి.శ్రీనివాస్, జి.దినేశ్, పి.గోపాల్ యాదవ్, మహేశ్, రజత్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి



ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేసిన తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం పార్ట్‌టైమ్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైమ్ అధ్యాపకులుగా పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని పార్ట్‌టైమ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ వరలక్ష్మి అన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొలి మహిళా విశ్వ విద్యాలయంలో ఎన్నో ఏళ్లగా చాలీచాలని వేతనాలతో పార్ట్‌టైమ్ అధ్యాపకులుగా పనిచేస్తున్నామన్నారు. అన్ని అర్హతలు ఉన్న తమను జూనియర్, డిగ్రీ కాలేజీల అధ్యాపకుల తరహాలోనే క్రమబద్ధీకరించాలని కోరారు. అందుకు ఎమ్మెల్సీ కవిత సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దేవేంద్ర, డాక్టర్ కవిత, డాక్టర్ మోహన్, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ సైదులు, దివ్య, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

గోల్కొండ: పనులను సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం టోలిచౌకిలోని తన కార్యాలయంలో అధికారులు, మజ్లిస్ నాయకులతో మాట్లాడారు. పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారుల పర్యవేక్షణ లేనందునే పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. అభివృద్ధి పనులపై స్థానిక మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు పర్యవేక్షిస్తూ వాటి వివరాలను ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, జలమండలి, బల్దియా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయండి



వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో కొత్తగా ప్రవేశపెట్టిన ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ యునైటెడ్ కాంట్రాక్టర్స్ ఫోరం మీడియా ఇన్‌ఛార్జ్, సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం వాటర్‌బోర్డు ఎండీ దానకిశోర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఏఎంఎస్ విధానంతో వందలాది మంది కాంట్రాక్టర్లు రోడ్డు పాలయ్యారన్నారు. ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్, చీఫ్ సెక్రెటరీ శాంతికుమారితో పాటు పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విధానాన్ని రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ప్రతిష్ఠాత్మకంగా బోనాల జాతర ఉత్సవాలు

చార్మినార్: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను ఈ ఏడాది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు చార్మినార్ ఈస్ట్ కోట్లాఆలిజాలోని శ్రీ కోట మైసమ్మ దేవాలయం కమిటీ చైర్మన్ రాయికోటి బాబురాజా తెలిపారు. జూలై 7న ఉదయం శ్రీ మాతేశ్వరి కలశ స్థాపన, 14న ఉదయం 6.01 గంటలకు శ్రీ మహంకాళి మహాభిషేకం, 9.01 గంటలకు శృంగార్ హారతి, 10.01 గంటలకు ధ్వజారోహణ, శిఖర పూజ, రాత్రి 8 గంటలకు కుంకుమార్చన, 15న 3.16 గంటలకు శ్రీ మాతేశ్వరి ఘటస్థాపన ఊరేగింపు, 16న శ్రీ మాతేశ్వరీ పూజ, 6.30 గంటలకు తొట్టెల ఊరేగింపు, 17న శ్రీ కోట మైసమ్మ మాతేశ్వరీ రంగం, 2 గంటలకు శ్రీ కోట మాతేశ్వరి ఘటం సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.

జీహెచ్ఎంసీ అదనపు ఎలక్షన్ కమిషనర్ పర్యటన



ఓటర్ లిస్టును పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ అదనపు ఎలక్షన్ కమిషనర్ పంకజ

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట జంగమ్మెట్ డివిజన్‌లోని బ్లాక్ 18/3ని జీహెచ్ఎంసీ అదనపు ఎలక్షన్ కమిషనర్ పంకజ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికంగా ఓటర్ లిస్టులో జరిగిన అవకతవకలను పరిశీలించారు. ఇటీవల జీహెచ్ఎంసీలో జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో బీజేపీ పార్టీ ప్రతినిధి పొన్న వెంకటరమణ తొలగించబడిన ఓటర్ల పునఃపరిశీలన జరగలేదని... అదే విధంగా 6 ఓట్ల కంటే ఎక్కువ ఉన్న ఇళ్లను వెరిఫికేషన్ సక్రమంగా జరగడం లేదని ఆరోపించిన నేపథ్యంలో ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో నకిలీ ఓట్లను గుర్తిస్తామని... అదే విధంగా తొలగించబడిన ఓటర్ల పునఃపరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ



పురస్కార గ్రహీతలతో ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: జాతీయ వికాసంలో మేధావుల పాత్ర ప్రధానమైదని పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు కళాకారులు జాతీయ సమైఖ్యతకు, సంస్కృతి పరిరక్షణకు పాటు పడాలన్నారు. పీవీ నర్సింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. అనంతరం పలువురు ప్రముఖులకు పీవీ స్మారక పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, దైవజ్ఞశర్మ, కవి కె.అరుణ, సంస్థ అధ్యక్షులు బి.రామచంద్రారావు, కార్యదర్శి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.